


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 208 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 3 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :208 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 3 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# ఇక అమరావతికి తిరుగులేదు..
# రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన అమరావతి బిల్లు
- అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించిన పార్లమెంట్
- ఇది చారిత్రక ఘట్టమని అభివర్ణించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతుల త్యాగాలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయు డు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడిం ది" అని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదిం చినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.



## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయన్న ట్రంప్
- ట్రంప్ చెప్పినట్లు తమ సైనిక సామర్థ్యాలను దెబ్బతినలేదన్న ఇరాన్
- మా ఆయుధ సంపత్తి గురించి అమెరికాకు సమాచారం లేదన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో

మిగతా 2లో



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. వాకౌట్ చేసిన వైసీపీ

- అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు
- రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం
- ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం

పెన్ పవర్ డెస్క్:అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.



## భారత నౌకలకు డోకా లేదు..

హర్మ్యూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

- హర్మ్యూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

మిగతా 2లో

## రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకుందాం: మంత్రి నారా లోకేశ్

- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లుకు ఆమోదం
- ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకోవాలని లోకేశ్ పిలుపు
- #APThanksIndia హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని సూచన
- రాజ్యసభలో బిల్లు పాసయ్యాక ఎంపీలతో మంత్రి లోకేశ్ భేటీ
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ విడుదల చేయనున్న కేంద్రం

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన హామీ లభించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమో దముద్ర వేశాయి.

మిగతా 2లో






## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

తెలంగాణ బీజేపీ ఎంపీ

- విభజన తర్వాత అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకున్నారన్న లక్ష్మణ్
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందన్న లక్ష్మణ్
- జగన్ హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బంది పెట్టారని మండిపాటు

మిగతా 2లో



## హర్మ్యూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

- హర్మ్యూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం
- ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్
- వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ
- ఇప్పటికే 6 భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని తెలిపిన విదేశాంగ శాఖ
- మిత్రదేశాలు సొంతంగా పోరాడాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

మిగతా 2లో

## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన
- పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యో గుల పెండింగ్

మిగతా 2లో




## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు



- ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు
- బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈడీ సోదాలు
- గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మిగతా 2లో



## చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

పెన్ పవర్ డెస్క్:తెలుగు ప్రజలందరికీ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానం దరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం చర్చకు ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అనుమతించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఏపీ రాజధాని గురించి

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భావజాలాన్ని అంతమొందించలేరు...!

నక్సలైట్ ఉద్యమం ముగింపు దినం 2026 మార్చి 31. అంటే దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధ పోరాటం చేస్తున్న ఒక సిద్ధాంత పార్టీని నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం దినం. ఈ కాలంలో వేలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు మరణించారు. ఈ ఆరు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం చాలా పొందింది, చాలా కోల్పోయింది. దినిని ఎవరూ నిరాకరించలేరు.

మార్క్సిస్టు–లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతం బలంతో ప్రారంభమైన నక్సల్బరి ఉద్యమం క్రమంగా దేశమంతటా వ్యాపించింది. దీనికి ప్రధాన కారణం – కులం, మతం పేరుతో పేద వర్గాలపై ఉన్నత వర్ణాలు, పెట్టుబడిదారులు, సామంతుల అణచివేత, అన్యాయం, అత్యాచారాలు. మావోయిస్టు ఉద్యమం పేద, సర్వహారా వర్గాలపై జరుగుతున్న, చేస్తున్న అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలు చేస్తున్న వారిని గుర్తించేలా చేసింది. స్వతంత్ర దేశ ప్రభుత్వాలు దీనిని సరిగ్గా గుర్తించి ఉంటే, ఇపుడు వేలాది, లక్షలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు చనిపోయేవారు కాదు. అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నక్సలైట్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో చేరారు. ప్రజలను చైతన్యపరిచారు. ఆదివాసీలకు విద్యాబోధన చేసి, అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. ప్రారంభంలో పోలీసులు, నక్సల్ వాదుల మధ్య పెద్ద శత్రుత్వం ఏమీ లేదు. నక్సలైట్లు గ్రామాల్లో సామంత వర్గాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని తీవ్రం చేశారు. దీన్ని చూసి సామంతులు ప్రభుత్వాలను సంప్రదించారు. ప్రభుత్వం సామంతుల భద్రత కోసం గ్రామాల్లో పోలీసులను పంపి నక్సలైట్లను తమ లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నిషేధం విధించింది. దీన్ని చూసి నక్సలైట్లు తమ భద్రత కోసం ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి, ఖనిజ సంపద, ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయడం ప్రారంభించారు. పెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల ధనబలంతో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టుబడిదారుల, పెద్ద కంపెనీల కోసం మావోయిస్టులను అడవుల నుంచి తరిమేందుకు ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. దీని ఫలితంగా పెద్ద ఎత్తున వేలాది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయబట్టారు. కొంత మంది మావోయిస్టు నాయకులు లొంగిపోయారు. ఈ ప్రక్రియకు ముందు మావోయిస్టుల వైపు నుంచి అనేక శాంతి ప్రతిపాదనలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలను తోసిపుచ్చింది, లొంగిపొండి లేదా ఎన్‌కౌంటర్‌లో చనిపోండి అని ప్రతిపాదన చేసింది. దేశాన్ని రక్షించే సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో తమ సొంత పౌరుల మీద దాడి చేసింది. దేశంలో ఇప్పటికీ అనేక మంది నక్సలైట్లు అడవుల్లో, జైళ్లలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు గణపతి ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదే సమయంలో ఒడిశా ఎమ్ఏడీసీ విభాగం కార్యదర్శి రజితా సాయుధ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసిన సహచరుల మరణం వృధా పోనివ్వమని ఆమె చెప్పారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ప్రతీ హింస కోసమేనని అందరికీ తెలుసు. దేశ, ప్రపంచ పౌరులు మంచి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పు మావోయిస్టు భావజాలం ద్వారా సాధ్యమవుతుంది. మావోయిస్టు భావజాలం ఇప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది

# రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

- మొదటి పేజి తరువాయి

ఈ చారిత్రాత్మక పరిణామం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (శ) వేదికగా స్పందిస్తూ... "రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజా రాజధానికి చట్టబద్ధత లభించింది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నేడు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. దీపాలతో సెల్ఫీ తీసుకుని 'మన రాజధాని మన గౌరవం' అంటూ చాూాూష్ముఅెం×అెఱఖు హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. బిల్లుపై చర్చ జరిగిన సమయంలో రాజ్యసభ గ్యాలరీ నుంచి లోకేశ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బిల్లు ఆమోదం పొందాక, దీనికి సహకరించిన పలు పార్టీల ఎంపీలను ఆయన నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్యసభ క్యాంటీన్‌లో వారితో భేటీ అయ్యారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగాక ఆమోదం లభించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా కేంద్ర కేబినెట్ దీనికి పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి, రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి చట్టబద్ధత ప్రక్రియ పూర్తవుతుంది.

# భారత నౌకలకు డోకా లేదు..

ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది.
ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ ౕ=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు.
ఇటీవల జరిగిన
మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (్రూ+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.
మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని
ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- మొదటి పేజి తరువాయి

దెబ్బతీశా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.
ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైంది. విభజనకు వ్యతిరేకం కాదు కానీ.. జరిగిన విధానం సరిగా లేదు. రాష్ట్ర విభజన దేశంలో తొలిసారి జరగలేదు. వాజ్‌పేయీ హయాంలో 3 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విభజన జరిగింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబు వైపు ఆశగా ఎదురుచూశారు. తెలుగు ప్రజలకు ఆయన ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములిచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ
నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# ఎన్ఫోర్స్మెంట్ అధికారుల దాడులు-నిల్వ ఉంచిన 34 సిలిండర్లు స్వాధీనం

**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ పి కొల్లి శ్రీనివాసరావు కు రాబడిన సమాచారం మేరకు ఒంగోలు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ రాఘవ రావు, ఎస్ ఐ నాగేశ్వరావు ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్ భాస్కర్ సిబ్బంది కందుకూరు పట్టణం లోని కుసుమ ఎలక్ట్రానిక్స్ లోఓనర్ కొల్లూరు శ్రీనివాసరావు అక్రమంగా కమర్షియల్ 34 సిలిండర్స్ నిల్వవుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా సిలిండర్ లను నిల్వవుంచి అధిక దర్లకు అమ్ముచునట్లు, అంతట వాటిని సీజ్ చేసి సుచిత భారత్ గ్యాస్ ఏజెన్సీ కందుకూరు అప్పగించారు.సిలిండర్ లను అక్రమ నిల్వ అధిక ధరలకు అమ్ముచున్నట్లు నిర్ధారించి, శ్రీనివాసరావు పైన తగు చర్య నిమిత్తం కొరకు 6(ఏ )కేసు ను ఒంగోలు జాయింట్ కలెక్టర్ కోర్ట్ లో



నమోదు చేయుటకు నిర్ధారించారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## అమరావతికి చట్టబద్ధతపై

# కందుకూరు ప్రజల హర్షం

### -ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ

### -మారుమోగిన జై అమరావతి నినాదం






**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

రాష్ట్ర రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ కందుకూరు పట్టణంలో గురువారం సాయంత్రం పెద్ద ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనలతో కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఉత్సవ ర్యాలీ జరిగింది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కార్యక్రమం కొనసాగగా మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మోదీ, చంద్రబాబు న్యాయకత్వం వర్ధిల్లాలి, జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ శాసనసభ్యులు దివి శివరాం సహా పలువురు నేతలు పూలమాలవేసి ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద శివరాం మాట్లాడుతూ రాజధాని కోసం 33 వేలఎకరాలు ఇచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెట్టినా, రాజధానిని అడ్డుకోవాలని చూసినా, చివరకు ధర్మమే గెలిచిందన్నారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో పార్లమెంటు ఉభయ సభల్లో రాజధానికి చట్టబద్ధత ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుదలతో, భావితరాల భవిష్యత్తు కోసం అమరావతిని విశ్వ నగరంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రజలంతా ఆయనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్ తీర్మానం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తుంటే జగన్ మాత్రం ఇంకా సిగ్గు లేకుండా ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని జగన్ భయపడుతున్నారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఇక తిరుగు లేదన్నారు. మరోసారి జగన్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు మాట్లాడుతూ అమరావతికి భూములు ఇచ్చిన రైతులతోపాటు, రాష్ట్ర ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. కేంద్రం సహకారంతో రాజధాని అత్యద్భుతంగా తయారవుతోందని ప్రశంసించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ.. స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నే రోశయ్య, ఉప్పుటూరి శ్రీను, వడ్లమూడి సురేష్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, సోమినేని రవీంద్ర, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, గోచిపాతల మోషే, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్నా, బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, వద్దేళ్ళ రవిచంద్ర, షేక్ సలాం, పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, మహిళా నేతలు తల్లపనేని పార్వతి, శ్రీలక్ష్మి అత్తంటి శ్రీలక్ష్మి, దాక్షాయణి, మీనా, సృజన, నారాయణమ్మ, సోమమ్మ, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

### ఇది చారిత్రాత్మక ఘట్టమన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 02**

ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్ లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని అశోక్ రెడ్డి ప్రత్యేకంగా స్మరించుకున్నారు.



"తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి అశోక్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని ముత్తుముల విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు. పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని అశోక్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని అశోక్ రెడ్డి దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

### స్వచ్ఛ రథం వాహనాన్ని ప్రారంభించిన

# ఎమ్మెల్యే ముత్తుముల

### స్వచ్ఛ రథం'తో పర్యావరణ మార్పు

### చెత్త రహిత సమాజమే లక్ష్యం

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి




**గిద్దలూరు: పెన్ పవర్ ఏప్రిల్ 2**

పట్టణ పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు గిద్దలూరులో 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రథం కేవలం చెత్తను సేకరించే వాహనం మాత్రమే కాదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చే ఒక వేదిక అని కొనియాడారు. ఈ పథకం యొక్క ప్రాథమిక ఉద్దేశం ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్, ఇనుము, కాగితం వంటి వ్యర్థాలను పారవేయకుండా, వాటిని తిరిగి ఉపయోగించుకునేలా రీ సైకిలింగ్ ప్రోత్సహించడం. "చెత్తను ఇవ్వండి - సరుకులు తీసుకోండి" అనే నినాదంతో ప్రజలను భాగస్వాములను చేయడమని నిత్యావసర సరుకులను ప్రతిఫలంగా ఇవ్వడం ద్వారా ప్రజల్లో ఉత్సాహాన్ని నింపడం అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం , నిల్వ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం ఈ రథం యొక్క ముఖ్య లక్ష్యమని ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల కలిగే అపరిశుభ్రతను నివారించి, దోమల పెరుగుదల , సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటం. గిద్దలూరు పట్టణాన్ని మరియు గ్రామీణ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాల వలె స్వచ్ఛంగా, అందంగా తీర్చిదిద్దడం తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ఇలాంటి వినూత్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రతి ఇల్లు స్వచ్ఛంగా ఉంటేనే, ఊరు స్వచ్ఛంగా ఉంటుంది. ఊరు స్వచ్ఛంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఈ స్వచ్ఛ రథాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత వాహనంగా భావించి సహకరించాలన్నారు.

# ప్రకృతి సోయగాల మధ్య కొలువైన నెమలిగుండ్ల రంగడి కళ్యాణం నేడే

### నేడు వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు









**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

నల్లమల కీకారణ్యం ప్రకృతి సోయగాల నడుమ వెలసిన మహిమాన్వితమైన క్షేత్రం నెమలిగుండ్ల రంగనాయకుని క్షేత్రం

స్వామి ఈ ప్రకృతి వడి లో నే భక్తుల మనోభావాలను నెరవేర్చేందుకు స్వయంభూ గా వెలిసాడు.గిద్దలూరు నియోజకవర్గ శీ లో ని రాచర్ల మండలం జె పి చెరువు కు 9 కి.మీ ల దూరం లో నల్లమల కీకారణ్యం లో వెలసిన ఈ ఆలయం ఆధ్యాత్మిక త కు ప్రకృతి సోయగాల కు నిలయంగా భాసిల్లుతుంది. ఈ క్షేత్రం లో గురువారం నుండి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి దర్శనార్థం వేలాదిమంది భక్తులు తరలి వచ్చి గోవింద నామ స్మరణ తో నల్లమల గిరులు దద్దరిల్లిపోతున్నాయి.

**ఆలయ విశిష్టత..:** ఇక్కడ లభించే పురాణ గాధ ల బట్టి మయుర మహర్షి శ్రీ మహా విష్ణువు ను దర్శించేందుకు ఈ ఆలయ ప్రాంతంలో ఘోర తపస్సు ఆచరించారు.స్వామి ని నిత్యం అర్చించి అభిషేకం చేయటానికి వీలుగా మహర్షి తన ముక్కుపుటముల తో భూమి ని త్రవ్వగా అక్కడ ఒక పెద్ద జలాశయం ఏర్పడింది. నెమలి ఆకారం పోలి ఉన్న మహర్షి ఈ గుండాన్ని త్రవ్వగా ఏర్పడిన గుండం గనుక నెమలిగుండం అనే పేరు సార్ధకం అయ్యింది.గుండ్ల బ్రహ్మేశ్వరశీ చెంత జన్మించిన గుండ్లకమ్మ నది కొండలు గుట్టల్లో ప్రవహించి నెమలిగుండశీ చెంత ఎత్తైనా కొండ నుండి జలపాతం వలే జాలువారి గుండం లో పడి అక్కడి నుండి భూ మార్గం లో పయనించి అనేక ప్రాంతాల్లో పంట పొలాలకు ఆధారమైంది.

**రంగనాయకుని చరిత్ర..:** నల్లమల కొండల్లో ఇసుక గుండం అనే చెంచు గూడెం ఉండేది అక్కడ బయన్న ,బయక్క అనే దంపతులు ఉండేవారు.వారికి సంతానం లేక అడవి ప్రాంతంలో సంచరిస్తున్న సమయంలో మహా విష్ణువు దర్శనం కోసం తపం ఆచరిస్తున్న మయూరా మహర్షి కనిపిస్తాడు.మహర్షి కి తమ సంతాన లేమి ని వివరిస్తాడు మీరు ఈ ప్రాంతంలో వెలసిన రంగ నాయక స్వామి ని గురించి తపస్సు చేయమని చెప్తాడు.దాంతో నాటి నుండి బయన్న బయక్క లు తదేక దీక్ష తో రంగ డి గురించి తపం ఆచరిస్తారు.ఆ ఫలం గా బయక్క గర్భం దాల్చి నవ మాసాలు నిండిన తర్వాత ఒక కుమార్తె జన్మిశీచింది.ఆమె పేరు చెంచు లక్ష్మీ గా నామకరణం చేశారు.ఒకానొక రోజు చెంచు లక్ష్మీ కి వివాహం చేయటానికి సంకల్పించారు.కానీ చెంచు లక్ష్మీ ఈ వివాహం తనకు వద్దని తాను శ్రీమన్నారాయుని ప్రేమిస్తున్నానని ఆయన్నే వివాహం ఆడుతానని పట్టుబట్టి కులాచారాన్ని ధిక్కరించి కుల పెద్ద ల తో విబేధించి చెంచు గూడెం వదిలి నెమలిగుండశీ చేరుకొని అక్కడ తపస్సు చేస్తున్న మాయూరా మహర్షి ని సందర్శించి మహర్షి కి తన మనో గతాన్ని వెల్లడించింది. ఆ సమయంలో శ్రీ మన్నారాయణుని సేవించి మాయూరా మహర్షి ఆమెకు నీ కోరిక తీరడానికి తపస్సే మార్గమని సెలవిచ్చారు. శ్రీ మహా విష్ణువు దర్శనం కోసం మాయూరా మహర్షి వివాహం కోసం చెంచు లక్ష్మీ లు ఘోర తపస్సు కు పూనుకున్నారు.ఈ ఇరువురి అభిష్టాలు నెరవేర్చడానికి వైకుంఠ వాసుదే తరలి వచ్చారు. చెంచు లక్ష్మీ భక్తి కి మెచ్చిన మహా విష్ణువు ను వివాహం ఆడి నెమలిగుండం వద్దనే నివాసం ఏర్పర్చుకున్నారు.మహా విష్ణువు ను సేవించిన మాయూరా మహర్షి కోరిక మేరకు నెమలి గుండం లో ఎత్తైన కొండ పై స్వయంభూ గా వెలసి భక్తుల కొంగు బంగారమై భక్తుల మనోభీష్టాలు నెరవేరుస్తారని సెలవిచ్చారు. స్వామి శిలా రూపాన్ని ధరించిన ఈ ప్రదేశం రంగనాయకుని క్షేత్రం గా విరాజిల్లుతుందని ఆశీర్వదించారు. నాడు శిలా రూపం ధరించిన స్వామి ఏ నేటి నెమలిగుండ్ల రంగనాయకుని స్వామి గా విరాజిల్లుతున్నారు.భూలోకం చేరిన మహా విష్ణువు ను వెతుకులాడుకుంటు వచ్చిన లక్ష్మీ దేవి రంగ సమేతుడైన స్వామి వారిని చూసి అలక వహించి కి మీ దూరం లో గల గుండ్లకమ్మ సమీపంలో గల ఒక సొరంగం దగ్గర లో కొండ పై తిష్ట వేసింది .అక్కడే శ్రీ మహా లక్ష్మీ శిల గా మారి పోతుంది.ఆ కొండ కోన ల్లో బొట్టు బొట్టు గా ప్రవహించే నీరే అమ్మ వారి కన్నీరు గా భావిస్తుంటారు. రంగడి ని దర్శించటానికి ముందు లచమ్మ పేట వద్ద ఆది లక్ష్మీ అమ్మ వారికి పూజలు చేయటం ఆనవాయితీ. అందుకే ఈ ప్రదేశాన్ని లక్ష్మమ్మ వనం,లచమ్మ పేట గా వ్యవహరిస్తారు.మాయూరా మహర్షి తో పాటు ఇక్కడి తేనె టీగలు,కోతులు భక్తి పారవశ్యం తో రంగన్ని అర్చించి పునీతులు అవుతుంటాయి.దట్టమైన నల్లమల కీకారణ్యం లో వెలసిన ఈ క్షేత్రాన్ని ప్రతి శనివారం తెరచి స్వామి వారికి అర్చక స్వాములు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు తరలి వచ్చి స్వామి ని దర్శించి మొక్కలు చెల్లించుకుంటారు.ఇక్కడ స్వామి వారికి ప్రధాన మైంది అగ్గి సేవ.ఈ అగ్గి సేవా చూసి తరించాల్సిందే.ఆలయ అర్చకులు పాండు రంగాచార్యులు, సత్యనారాయణ చార్యులు,రంగా చార్యులు ప్రధాన అర్చకులు గా ఉన్నారు. ఈ స్వామి ని దర్శించాలంటే శుచి శుభ్రత తప్పనిసరి గా పాటించాల్సిశీదే.లేకుంటే తేనె టీగలు వారిని వెంటాడి వారిని తరిమి వేస్తాయి.నేటికి ఈ విశిష్టత కనిపిస్తూనే ఉంది.ఇంతటి మహిమాన్వితమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుండి 5 వ తేదీ వరకు గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోకరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ స్వామి కి శుక్రవారం కమణీయంగా కళ్యాణం నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని చూచి తరించవలసిందే.బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని నల్లమల లో ని ఆలయ ప్రాంగణం విద్యుత్ దీప కాంతు ల తో విరాజిల్లుతోశీది.భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# ద్విచక్ర వాహనాల దొంగకు జైలు శిక్ష

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

గిద్దలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2025వ సంవత్సరంలో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన సురేష్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని గిద్దలూరు కోర్టులో ప్రవేశపెట్టి పూర్తి సాక్షాదారులతో పోలీసులు నేరాన్ని నిరూపించారు. విచారణ అనంతరం న్యాయమూర్తి భరత్ చంద్ర నిందితుడికి ఆరు నెలలు కఠిన కారాగార జైలు శిక్ష విధించారు.

# సివిల్ సప్లై హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

గిద్దలూరు ఎమ్మార్వో కార్యాలయం నందు ఎలక్షన్ డి టి ఇబ్రహీం ఖలీల్ కు హమాలీ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పి శ్రీనివాసులు మాట్లాడుతూ 2026 జనవరి నుండి ప్రభుత్వ రైస్ గోడౌన్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెంచాల్సిన కూలి రేట్లు రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదని అన్నారు. ప్రతి నెల 18వ తేదీ రైస్ గోడౌన్ తోలకం ప్రారంభించాలని, హమాలీల లేబర్ కూలి హమాలీ కార్మికుల వ్యక్తిగత అకౌంట్లో వేయాలని, పిఎఫ్ ఈఎస్ఐ సమస్య పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి ఆవులయ్య, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్ వీరయ్య, చంటి, చందు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ అదుపుతప్పి రైతు మృతి



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**

పుల్లలచెరువు మండలంలో ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి చెందాడు. చెన్నంపల్లి గ్రామానికి చెందిన గుమ్మ చిన్న గురవయ్య (44) బుధవారం దుర్గి నుంచి మొక్కజొన్న సంచులు తీసుకుని వస్తుండగా మురికిమళ్ల తండా సమీపంలో ప్రమాదం జరిగింది.ఎన్ హెచ్--565పై రహదారి ఏటవాలుగా ఉండటంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై నుంచి జారిపడిన చిన్న గురవయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. సాంబశివరావు తెలిపారు.ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**



ముటుకుల, మల్లపాలెం పంచాయతీలకు ఎం.మరియ దాసు, సుద్దకురావతండా పుల్లారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్, గంగవరం, రాచకొండ పంచాయతీలకు డిప్యూటీ ఎంపిడివో చక్రవర్తి, ఐటివరం,మానేపల్లి డిప్యూటీ ఎంపిడివో హనుమంతరావు, ఏండ్రాపల్లి, కోమరోలు ఎంఈవో 1 వెంకట భాస్కర్, పుల్లల చెరువు, గారపెంట, నరాజాముల తండా, పెద్ద పిఆర్సీతండా శతకొడు ఏవో మరియదాసు, చాపలమడుగు, పిడికిటి వానిపల్లి, నాయుడు పాలెం పంచాయతీలకు తహసిల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, మర్రివేముల, కవలకుంట్ల పంచాయతీలకు పశు వైద్యాధికారి డి.నాగుల్ మీరా ను ప్రత్యేక అధికారులుగా జిల్లాకలెక్టర్ నితమించినట్లు ఎంపిడివో మరియదాసు తెలిపారు.

# లక్ష్యాన్ని నిర్ధారించుకుని ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 2**

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకొని ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని కొమరోలు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అన్వేష్ కుమార్ పేర్కొన్నారు .కొమరోలు లోని నరేష్ రెడ్డి హై స్కూల్‌లో గురువారం ఆ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, కొమరోలు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అన్వేష్ కుమార్, ప్రగతి జూనియర్ కళాశాల డైరెక్టర్ సందీప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అన్వేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్ధారించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని కోరారు. అప్పుడే లక్ష్యసాధన జరిగి తాను కోరుకున్న విధంగా ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదల ,తన మేధాశక్తితో ముందుకు సాగవలసి ఉంటుందని పేర్కొన్నారు. విద్య విలువ చాలా గొప్పదని, చదువు గొప్పతనం ఇప్పట్లో విద్యార్థులకు తెలియకపోయినా, భవిష్యత్తులో చదువు విలువ ఏమిటో తెలిసి వస్తుందన్నారు. అంతేకాక సమయం విలువ కూడా ఎంతో గొప్పదని, పోగొట్టుకున్న డబ్బు, సంపదనైనా తిరిగి పొందవచ్చు కానీ ,గడిచిన సమయాన్ని తిరిగి పొందలేమని, అందువల్ల విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు వాడకాన్ని చాలా వరకు తగ్గించాలని, అవసరమున్నంతవరకు మాత్రమే సెల్ ఫోన్లు వినియోగించగలిగితే ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని వివరించారు. అంతేకాక సమయం కూడా వృధా కాదని, సెల్ఫోన్ల వలన ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో నష్టాలు కూడా అంతకుమించి ఉన్నాయని వాస్తవాన్ని గుర్తించాలన్నారు. సెల్ ఫోను అవసరానికి వినియోగించుకోవాలే తప్ప ఒక వ్యసనంగా ఉపయోగించుకోవద్దని కోరారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఆన్లైన్ గేమ్ లకు, ఇతర చెడు వ్యసనాలకు గురి అయితే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని ఈ వాస్తవాన్ని ప్రతి విద్యార్థి గమనించి సక్రమ మార్గంలో పయనించి తన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల ప్రవర్తన, వారి నడవడిక, వారి క్రమశిక్షణ, దినచర్య తదితరవాటిని గమనిస్తూ వారికి అవసరమైన సూచనలు సలహాలు ఇస్తూ వారిని మంచి మార్గంలో పయనించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు చదువుతోపాటు మంచి అలవాట్లు ,క్రమశిక్షణ, దేశభక్తి ,సమాజ సేవ ,తదితర వాటిని బోధిస్తూ వారి ఉద్యోగుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. విద్యార్థులు బ్యాంకుల పనితీరు ,బ్యాంకులలో లావాదేవీలు,




బ్యాంకులు ఖాతాదారులకు అందిస్తున్న సేవలపైఅవగాహన పెంచుకోవాలన్నారు .విద్యార్థి దశ నుంచే డబ్బును పొదుపు చేయటం అలవాటు చేసుకోవాలన్నారు .తద్వారా భవిష్యత్తులో పొదుపు చేసుకున్న డబ్బు అవసరానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి సందీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులను ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బుతో చదివిస్తూ ఉంటారని ,తమ చిన్నారుల చదువుకు ,వారు ఉజ్వల భవిష్యత్తుకు వారు చేస్తున్న శ్రమ ఎంతో గొప్పదని, అందువలన విద్యార్థులు తల్లిదండ్రుల శ్రమను గుర్తించి వారి ఆశయ సాధనకు ముందుకు సాగాలన్నారు. తాము శ్రమజీవులమైనా, తమ బిడ్డలు తమలాగా శ్రమజీవులు కాకూడదని ,,గొప్ప చదువులు చదివి ,,మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని తల్లిదండ్రులు ఆశిస్తుంటారని పేర్కొన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాము గత మూడు సంవత్సరాలుగా నరేష్ రెడ్డి హైస్కూల్ను నిర్వహిస్తున్నామని ,ధనాపేక్ష కోసం కాకుండా పేద విద్యార్థులకు నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పించాలన్న ఆశయంతోనే పాఠశాల నిర్వహిస్తున్నామని ,అంతేగాక గత 15 సంవత్సరాలుగా కొమరోలులో తాము శ్రీ ప్రగతి జూనియర్ కళాశాలను స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు గొప్ప




గొప్ప ఉద్యోగాలు సాధించి స్థిరపడి ఉన్నారని సగర్వంగా పేర్కొన్నారు .పాఠశాలలో, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ,అధ్యాపకుల కృషి వారి సేవలు మరువరానివని ,వారి కృషి ఫలితంగానే పాఠశాల కళాశాలకు అత్యుత్తమ ఫలితాలు వస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు వరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తమ పాఠశాలలో ఈ ఏడాది 415 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, వారిలో ఈ ఏడాది తమ హై స్కూల్ నుంచి 21 మంది విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై పరీక్షలు వ్రాశారని, వారందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి పెడతారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి బాల్యం నుంచే కృషి పట్టుదల క్రమశిక్షణ తో మెలుగుతూ ఉపాధ్యాయులు అందించే నాణ్యమైన బోధనను పునికి పుచ్చుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ఆ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు బ్యాంకు మేనేజర్ అన్వేష్ కుమార్, ప్రగతి జూనియర్ కళాశాల డైరెక్టర్ సందీప్ రెడ్డి ని ప్రధానోపాధ్యాయులు ఎస్.వి రామకృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు . ఆ కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది తమ అమూల్యమైన సందేశాలను విద్యార్థులకు అందించారు .సమావేశం అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రైతుల రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రద్దు -ఏప్రిల్ 1 నుంచి అమలు



**కొమరోలు, పెన్ పవర్ ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా పంట రుణాలు పొందే రైతులకు ఇకనుంచి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయడం లేదని కొమరోలు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అన్వేష్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా వ్యవసాయ ,పాడి పరిశ్రమ, మత్స్య సాగు రుణాల మంజూరు, రెన్యువల్ సమయంలో రుణగ్రస్తుల నుంచి ప్రాసెసింగ్ ఫీజు కింద 0.7% ఫీజును వసూలు చేసేవారు. దీనితో రైతులు తీసుకుంటున్న రుణాన్ని బట్టి గరిష్టంగా 2,100 రూపాయల వరకు రైతులు అదనంగా చెల్లించవలసి ఉండేది. దీనితో రైతులు ఆవేదన ,ఆందోళన వ్యక్తం




చేసేవారు . తమపై అదనంగా విధిస్తున్న ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేయాలని కోరుతూ రైతులు గత చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఇకనుంచి వ్యసాయం, పాడి పరిశ్రమ, మత్స్య సాగు రుణాల మంజూరులో రైతుల నుంచి ప్రాసెసింగ్ ఫీజు కింద అదనంగా వసూలు చేస్తున్న 0.7% ఫీజును రద్దు చేస్తూ బ్యాంకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు రద్దు నిర్ణయం ఈ నెల 1వ తేదీ నుంచి అమలు లోనికి వచ్చిందని ఆయన తెలిపారు. బ్యాంకు ఉన్నతాధికారులు తీసుకొన్న నిర్ణయం వలన వేలాదిమంది అన్నదాతలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని , రైతులకు గరిష్టంగా 2000 రూపాయల వరకు ఆదా అవుతుందని ఆయన తెలిపారు. రైతులు ఎటువంటి అదనపు ఫీజులు లేకుండానే 3 లక్షల వరకు రుణాలు పొందవచ్చని, ప్రాసెసింగ్ ఫీజు రద్దు నిర్ణయం కేవలం పంట రుణాలకే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే పాడి పరిశ్రమ చేపల పెంపకం తదితర వాటి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కావున మండలంలోని రైతులు తమ బ్యాంకు ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించకుండానే పంట రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ అన్వేష్ కుమార్ తెలిపారు.

# ఎస్సీల భూముల ఆక్రమణపై విచారణ

## బాధితులకు న్యాయం చేస్తాం -ఎస్సీ కమిషన్ సభ్యుడు గౌతం రాజు



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**

మండలంలోని కున్నంపల్లి గ్రామంలో ఎస్సీలకు కేటాయించిన భూముల ఆక్రమణపై ఎస్సీ కమిషన్ దృష్టి సారించింది.బాధితుల ఫిర్యాదుతో స్పందించిన కమిషన్ అధికారులు గురువారం పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు.కున్నంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 583లో ఎస్సీలకు చెందిన బుధాటి అంజమ్మ, ముండ్ల మరియబాబు భూములను అగ్రవర్ణాలకు చెందిన సుబ్బారెడ్డి, కృష్ణరెడ్డి, రామిరెడ్డి ఆక్రమించుకుని వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వారు ఇటీవల విజయవాడలోని ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు.దీనిపై స్పందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ఆదేశాల మేరకు కమిషన్ సభ్యుడు డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ పుల్లలచెరువుకు చేరుకుని సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.తహసీల్దార్ కార్యాలయంలో బాధితుల సమక్షంలో భూసంబంధిత రికార్డులను సవివరంగా పరిశీలించారు. అనంతరం



కున్నంపల్లి గ్రామానికి వెళ్లి భూమిని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ రాజ్ మాట్లాడుతూ రికార్డు ప్రకారం ఎస్సీలకు కేటాయించిన భూములను వారికి అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమంగా ఆక్రమించి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాధితులకు ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. అధికారులను అప్రమత్తం చేస్తూ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ విచారణతో బాధితుల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పసుపులేటి బుజ్జి, ఆర్మీ బుజ్జి, ఆకుల వెంకటేశ్వర్లు, బిజెపి మండల కన్వీనర్ డాక్టర్ మల్లికార్జున్,మండల సర్వేర్ రాముల్ నాయక్, తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి శాశ్వత రాజధాని బిల్లుకు ఆమోదం

## టిడిపి నేతల ఆనందోత్సాహం



**సి ఎస్ పురం, పెన్‌పవర్ ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు కనిగిరి శాసనసభ్యులు జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలపై మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన మండల కేంద్రం సి ఎస్ పురం బస్టాండ్ సెంటర్లో టిడిపి కార్యకర్తలు, నాయకులు కొవ్వొత్తులు వెలిగించి ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు జై అమరావతి నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ, అమరావతి రాష్ట్ర అభివృద్ధికి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమని, టిడిపి ప్రభుత్వం సంకల్పించిన ప్రజా రాజధాని రూపుదాల్చే దిశగా ఇది చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. ఏపీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా అమరావతి శాశ్వత రాజధానిగా నిలవడం ఆనందదాయకమని, రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక మలుపుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు , మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్య , రామకృష్ణంరాజు, రేనాటి వెంకటేశ్వర్లు, వెంకటాద్రి, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# డప్పు కళాకారుడికి పెన్షన్ అందజేత..

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**

ప్రమాదంతో చికిత్స పొందుతున్న డప్పు కళాకారుడికి పెన్షన్‌ను అధికారులు స్వయంగా వెళ్లి అందజేసిన ఘటన పుల్లలచెరువులో చోటుచేసుకుంది. పుల్లలచెరువు గ్రామపంచాయతీకి చెందిన లింగంగుంట్ల ఏసోబు ఫిబ్రవరిలో గుంటూరులో ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై అక్కడి లలిత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కారణంగా గత రెండు నెలలుగా ఆయనకు అందాల్సిన డప్పు కళాకారుల పెన్షన్ తీసుకోలేకపోయారు.దీనిపై కుటుంబ సభ్యులు ఎంపీడీవో మరియదాసును కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన సూచనల మేరకు సచివాలయంలో వెల్ఫేర్ ఏ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి. శ్రీను నాయక్ గుంటూరు వెళ్లి ఏసోబుకు పెన్షన్ అందజేశారు.సమయానికి స్పందించి సహాయం చేసిన అధికారులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి బొబ్బూరి రమేష్, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**

స్వచ్ఛ గ్రామ రూపకల్పనకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు అన్నారు కనిగిరి శాసనసభ్యులు జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సి ఎస్ పురం కేజీబీవీ విద్యాలయ ఆవరణలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వి బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో గురువారం టిడిపి నాయకులు జండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు అధికారులు మాట్లాడుతూ ప్రజల్లో శుభ్రత పర్యావరణ సంరక్షణ పై నూతన అవగాహన కల్పించడమే ప్రత్యేక రథ ప్రయాణా లక్ష్యమని అన్నారు పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలైన ప్లాస్టిక్ వాడిన ఐరన్ వస్తువులను రీసైకిల్ చేయించడం ద్వారా పరిశుభ్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ రథం ద్వారా ప్రజలు తమ ఇళ్లల్లో ఉన్న ప్లాస్టిక్ ఐరన్ వంటి వస్తువులను ఇచ్చి ప్రతిఫలంగా నిత్యవసర సరుకులు పొందవచ్చు అన్నారు స్వచ్ఛ రథం గ్రామాల్లో తిరుగుతూ చెత్త నిర్వాహన ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ రీసైక్లింగ్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి రథములు ఏర్పాటు చేసిన ప్రత్యేక బిన్లలో ప్లాస్టిక్ ఐరన్ అందించే వారికి నిత్యవసర సరుకులు అందిస్తారని అన్నారు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథానికి ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని అన్నారు స్వచ్ఛ రథాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాలు సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, జివిఆర్ ట్రస్ట్ చైర్మన్ జి శ్రీనివాస్ వర్మ, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు కె వెంకటస్వామి, టిడిపి రైతు ఉపాధ్యక్షులు గజ్జల కోటిరెడ్డి, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బోయిన మాలకొండయ్య, టిడిపి నాయకులు పోకల మాల్యాద్రి, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటాద్రి, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు యేసు రత్నం, పట్టణ ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి రవి, టిడిపి నాయకులు గురు కృష్ణ మండల ప్రజా పరిషత్ కార్యాల సిబ్బంది, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# అమరావతి భవిష్యత్తుకు మైలురాయి... ఏపీఎం



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధానిగా పార్లమెంట్‌లో ఆమోదం లభించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయని పుల్లల చెరువు డిఆర్ డీఏ వెలుగు ఏపీఎం నూనె వెంకటయ్య తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ, అమరావతి అభివృద్ధి ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, కృషి వల్లే ఇది సాధ్యమైందని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవలను గుర్తుచేసుకుంటూ, యర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఏరీక్షన్ బాబుకి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, విఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు కలిసి అమరావతి ఆమోదానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని వారు అన్నారు.

# అమరావతి చట్టబద్ధతతో అభివృద్ధి -ఎంపీడీవో



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 2**

రాష్ట్ర విభజన చట్టానికి సవరణ చేస్తూ అమరావతిని అధికారిక రాజధానిగా గుర్తించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండలంలోని అధికారులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మరియదాస్ మాట్లాడుతూ అమరావతిని అధికారిక రాజధానిగా గుర్తించడం ద్వారా రాష్ట్రానికి స్పష్టమైన దిశానిర్దేశం లభించిందన్నారు. రాజధాని అభివృద్ధి వేగవంతమవడంతో పాటు దేశ, విదేశీ పెట్టుబడులు ఆకర్షితమవుతాయని, తద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. అలాగే అధికారులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఈ నిర్ణయం ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేసినట్టేనన్నారు. అమరావతి అభివృద్ధి రాష్ట్ర సమగ్ర పురోగతికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అందరూ కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. మొత్తంగా అమరావతిని రాజధానిగా చట్టబద్ధం చేయడం రాష్ట్ర అభివృద్ధి పథంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ చారిత్రాత్మక నిర్ణయాన్ని హర్షధ్వానాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మోషే, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం బొబ్బూరి రమేష్





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకు అందుతున్నాయని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం టిడిపి కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కనిగిరి శాసనసభ్యులు జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన వి బైల్ గ్రామమునకు చెందిన నాగిశెట్టి వెంకటేశ్వర్లు, సిఎస్పురం నకు చెందిన గుంజే శంకరయ్య, డిజి పేట గ్రామం నకు చెందిన కువ్వారపు సరోజనమ్మ లకు టిడిపి నాయకులు అందజేశారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడంలో కూటమి ప్రభుత్వం కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఐదు సంవత్సరములో చేసిన సాయాన్ని సీఎం చంద్రబాబు ఏడాదిన్నరలోనే అధిగమించారని కొనియాడారు పేదలకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వము అండగా నిలుస్తుందని, ప్రజల సమస్యలను గుర్తించి సహాయ సహకారాలు అందించడంలో, కనిగిరి ప్రాంత అభివృద్ధికి మరియు ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడు ముందుండి పోరాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఖర్చులు నిమిత్తం మంజూరు చేయించిన టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, జివిఆర్ టెస్ట్ చైర్మన్ టిడిపి నాయకులు జి శ్రీనివాస్ వర్మ, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు కె వెంకటస్వామి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, మండల క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకటకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, మండల రైతు ఉపాధ్యక్షులు గజ్జల కోటిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కువ్వారపు యేసు రత్నం, పట్టణ ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు పోకల మాల్యాద్రి, రవి, ప్రసాదు, గురు కృష్ణ టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# భారతికి సత్కారం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**

గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేసిన సందర్భంగా జె భారతి ని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఎ వి సుబ్బారెడ్డి, మార్కాపురం డిప్యూటీ డిఇఓ ఏ శ్రీనివాసులురెడ్డి సత్కరించారు మండలంలోని అనికాళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జె భారతిని మార్కాపురం జెడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శాలువా తో సత్కరించి జ్ఞాపిక అందజేసి అభినందించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జె ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు

# పార్లమెంట్ ఆమోదంతో వీడిన అమరావతి పట్టిన గ్రహణం



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 2**

రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ,పార్లమెంటులో చేసిన ఆమోదంతో అమరావతి కి పట్టిన గ్రహం వీడిందని గిద్దలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ ,గిద్దలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు షేక్ హసీనా పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ చేసే బిల్లుకు పార్లమెంటు లో ఆమోదం లభించడం పట్ల అమరావతికి మద్దతు పలికిన దేశ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు షేక్ హసీనా కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సహకారంతో పొరుగు రాష్ట్రాల రాజధానులకు ధీటుగా అమరావతిని అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు .ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని సహకారం చేసి, ఆంధ్ర రాష్ట్ర ప్రజల చిరకాల కలను నిజం చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రభుత్వానికి బిల్లుకు ఆమోదం తెలిపిన పార్లమెంట్ సభ్యులకు, రాష్ట్రంలోని కూటమి పార్టీల శాసనసభ్యులకు శాసన మండలి సభ్యులకు షేక్ హసీనా ధన్యవాదాలు తెలిపారు.



# ఆటిజం పై అపోహలు వీడాలి



**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

పిల్లల్లో వయసుకు తగ్గట్టు మానసిక ఎదుగుదల లేకపోవడమే ఆటిజమని, ఆటిజం పై అపోహలు వీడాలని తల్లిదండ్రులకు ఐఈఆర్పీ కూనం ఉదయలక్ష్మి సూచించారు. పట్టణంలోని యిస్కాలవారివీది ఆదర్శ పాఠశాలలోని భవిత కేంద్రంలో ఆటిజం పై అవగాహన కార్యక్రమం స్థానిక హెచ్ఎం దివి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉదయలక్ష్మి మాట్లాడుతూ ఆటిజం లక్షణాలు ఉన్న పిల్లల్లో మెదడులోని కొంత భాగం సరిగా పనిచేయదని, అందువల్ల వాళ్లు మామూలు పిల్లలతో పోలిస్తే కొన్ని విషయాల్లో వెనకబడిపోతారని తెలిపారు. ఇలాంటి పిల్లలు సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఆటిజం లక్షణాలు రెండు నుంచి మూడేళ్ల వయసులోనే కనిపిస్తాయని, తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆటిజం లక్షణాలు ఉన్న పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఇలాంటి పిల్లలకు భవిత కేంద్రం అండగా నిలుస్తుందని చెప్పారు. మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు భవితా కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. సరిగ్గా మానసిక ఎదుగుదల లేని పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించడం ద్వారా వారు మానసికంగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయా అరుణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత దేశ క్షేమము కొరకు ప్రార్థించిన దైవ సేవకులు

**పెద్దదోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 2**




దోర్నాల మండల పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ మంత్లీ మీటింగ్ సెవెంత్ డే అడ్వెంటిస్ట్ చర్చ్- కడపరాజుపల్లి గ్రామంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాస్టర్ మేడిపల్లి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో దేవునికి మహిమకరంగా జరిగింది. పాస్టర్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ బరిగెల జాన్ ప్రసాదరావు దైవ సందేశం అందిస్తూ సమాజములో అనేక ప్రాంతాలలో క్రైస్తవుల పట్ల జరుగుచున్న దాడులను బట్టి పాముల వలే వివేకము కలిగి పావురము వలే నిష్కపటులై యుండి అనేక ఆత్మలను రక్షించి భారత దేశ ప్రజలను పరలోక రాజ్యము చేర్చులాగున దైవసేవకులందరూ బోధిస్తూ మరియు దేశ క్షేమము కొరకు ప్రార్థించాలని ఉపదేశించడం జరిగింది. గౌరవ అధ్యక్షులు రెవరెండ్ సింగా యేసుదానం మాట్లాడుతూ దైవ సేవకులు అందరు ఐక్యత కలిగి జీవిస్తూ క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ, అప్పగించిన పరిచర్య లో నమ్మకస్తులుగా ఉండాలని ప్రబోధించడం జరిగింది. అసోసియేషన్ సెక్రటరీ పాస్టర్ మేడిపల్లి అశోక్ కుమార్ చిన్న కుమార్తె సుజన్ గ్రేస్ జన్మదిన కూడికలో యూనియన్ ట్రెజరర్ రెవరెండ్ యలకపాటి రంజిత్ రాజ్ వాక్య పరిచర్య చేస్తూ పిల్లలు తల్లితండ్రుల మాట శ్రద్ధగా వినుట ద్వారా మరియు తల్లిదండ్రులను సన్మానించుట ద్వారా దీర్ఘాయుష్షును పొందుతారని తెలియజేయడం జరిగింది. దోర్నాల మండల పాస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బుట్టి పాల్ స్పర్జన్ మాట్లాడుతూ పిల్లలంటే యేసుక్రీస్తుకు ఎంతో ప్రేమని, పిల్లలను దగ్గరకు పిలిచి తన రెండు చేతులు వారి మీద ఉంచి ఆశీర్వదించిన దేవుడని తెలియజేస్తూ సుజన్ గ్రేస్ ఉజ్వల భవిష్యత్తు నిమిత్తం ప్రార్థించి కేక్ కటింగ్ చేయించడం జరిగింది. నూతనముగా అసోసియేషన్ లో జాయిన్ అయిన కొంతమంది సంఘ కాపరులకు సువార్తికులకు గుర్తింపు కార్డులు కమిటీ నాయకులు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చాట్ల ఇర్మియా,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సింగా సురేష్ బాబు, పాస్టర్ బి. యన్ అగస్టిన్, పాస్టర్ సింగా ఏసన్న, రెవరెండ్ గుంటి బాబురావు, కాకర్ల రాజయ్య, సువార్తీకులు కోడి శ్రీను, గోన లివింగ్ స్టోన్, దర్శనం ఇమ్మానుయేల్ మరియు కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.



# పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కంచర్ల శ్రీకాంత్







**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2:**
పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం కందుకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రణవి చిన్నపిల్లల, కంటి వైద్యశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కలియదిగిరి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ డాక్టర్లు నవీన్, ప్రశాంతి దంపతులను అభినందించారు. కందుకూరులో ఒక మంచి వసతులతో కూడిన ఆసుపత్రిని అందుబాటులోకి తేవడం గొప్ప విషయమన్నారు. ఇప్పటివరకు చిన్న పిల్లలకు సంబంధించి లేదా కంటి వైద్యానికి సంబంధించి సమస్య వస్తే ఒంగోలు లేదా నెల్లూరుకు వెళ్లేవారని, ఇకపై అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అనుభవం ఉన్న డాక్టర్ల పర్యవేక్షణలో ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుతాయన్నారు. ప్రజల జేబు చూసి వైద్య సేవలు అందించాలని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల డాక్టర్లకు సూచించారు. అనంతరం పట్టణంలోని తులసి డెంటల్ హాస్పిటల్‌ను సందర్శించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కోటారెడ్డి కుమారులు డాక్టర్ శివ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు దామా మల్లేశ్వరరావు, పోకూరి రాంబాబు, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు నూతన పెన్షన్లు అందజేయాలి

## కలెక్టర్ ను కోరిన డాక్టర్ షేక్ మహబూబ్ వలీ



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 2**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న నూతన పెన్షన్లు మంజూరు చేయకపోవడం దారుణమని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలీ అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో పేద, మధ్యతరగతికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా చెరుకు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ రెహనాభాను, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గిద్దలూరుకు మరో కొత్త రైల్






Apr 01 2026 (20:24) India Rail Info 1

IMG20732-2214582/Secunderabad Nandyal Intercity SF Express
SC/Secunderabad Jn to NDL/Nandyal Jn
Type: SuperFast Zone: SCR
IMAGINARY TRAIN by Koushik009
8h 5m - 444 km - 11 halts - Departs Daily

| # | Code | Station Name | Arr | Dep | Halt | PF | Day | Km | Spd | Elv | Zone |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | SC | Secunderabad Jn | | 05:45 | | | 1 | 0 | 46 | 536 | SCR |
| 2 | CHZ | Charlapalli | 06:01 | 06:03 | 2m | | 1 | 12 | 72 | 525 | SCR |
| 3 | NLDA | Nalgonda | 07:24 | 07:25 | 1m | | 1 | 110 | 75 | 226 | SCR |
| 4 | MRGA | Miryalaguda | 07:55 | 07:56 | 1m | | 1 | 148 | 74 | | SCR |
| 5 | NDKD | Nadikude Jn | 08:27 | 08:28 | 1m | | 1 | 186 | 71 | | SCR |
| 6 | PGRL | Piduguralla | 08:46 | 08:47 | 1m | | 1 | 207 | 25 | 106 | SCR |
| 7 | NLPI | Nemalipuri | 09:17 | 09:18 | 1m | | 1 | 220 | 54 | | SCR |
| 8 | RPCA | Rompicharla | 09:42 | 09:43 | 1m | | 1 | 242 | 53 | | SCR |
| 9 | VKN | Vinukonda | 10:14 | 10:15 | 1m | | 1 | 269 | 72 | 83 | SCR |
| 10 | MRK | Markapur Road | 11:06 | 11:07 | 1m | | 1 | 331 | 71 | 160 | SCR |
| 11 | CBM | Cumbum | 11:29 | 11:30 | 1m | | 1 | 357 | 75 | 196 | SCR |
| 12 | GID | Giddalur | 11:57 | 11:58 | 1m | | 1 | 390 | 29 | | SCR |
| 13 | NDL | Nandyal Jn | 13:50 | | | | 1 | 444 | - | 211 | SCR |

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**
సికింద్రాబాద్ ‌శీ నంద్యాల, నంద్యాల్‌ శీ సికింద్రాబాద్ నూతన రైలు ప్రారంభం కానున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. సికింద్రాబాద్ నుంచి నల్లగొండ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ మార్కాపురం, కంభం గిద్దలూరు, నంద్యాల వరకు సూపర్ ఫాస్ట్ ఇంటర్సిటీ రైలు ప్రవేశపెట్టనున్నారు. తిరుగు ప్రయాణంలో నంద్యాల్‌ శీ సికింద్రాబాద్ చేరుతుంది ఈ రైలు. సికింద్రాబాద్లో ఉదయం 5 గంటల 45 నిమిషాలకు బయలుదేరి గిద్దలూరు కు12.ా6 గంటలకు వస్తుంది, తిరుగు ప్రయాణంలో గిద్దలూరు కు 3:15 నిమిషాలకు బయలుదేరి సికింద్రాబాద్ కు రాత్రి 10 గంటల 40 నిమిషాలకు చేరుతుంది. ఈ రైలు ఇంటర్సిటీగా సూపర్ ఫాస్ట్ తో ప్రతి రోజు నడుస్తుంది.

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

## సంతృప్తి వ్యక్తం చేసిన కేవీఎన్ఎల్ జెడ్ పి హెచ్ ఎస్ ఉపాధ్యాయులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**
పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారం మండల కేంద్రమైన సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల విద్యార్థుల కేరింతల నడుమ ప్రశాంతంగా ముగిసినట్లు శీలంవారిపల్లి కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల ఉపాధ్యాయులు సుబ్బయ్య, మధు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించారని, విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారని తెలిపారు గత సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా మా పాఠశాలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో భాగంగా సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పూర్తి చేసిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్మెంట్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పరీక్షలు సజావుగా ముగియడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతూ ఒకరినొకరు అభినందించుకుంటూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు.



# రైతులకు పాస్ పుస్తకాల వల్ల ఎంతో మేలు

## మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత స్పష్టం

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 2**
రైతులకు పాస్ పుస్తకాల వల్ల ఎంతో మేలు జరుగుతుందని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత చెప్పారు. గురువారం నాడు మండలంలోని జువ్వలేరు గ్రామంలో జరిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ భూమి యాజమాన్య హక్కుల పత్రాల ద్వారా రైతులకు ఆయా భూముల మీద పూర్తిస్థాయి హక్కు ఏర్పడుతుందన్నారు. అలాగే వ్యవసాయపరంగా రైతులకు పాస్ పుస్తకాలు ఎంతగానో తోడ్పడతాయని ఆమె చెప్పారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగపరచుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ విజయ సునీత సూచించారు. అనంతరం జువ్వలేరు గ్రామంలోని 350 మంది రైతులకు కలెక్టర్ విజయ సునీత పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు,



మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఆహార సలహా సంఘం సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత, మాజీ సర్పంచ్ వై వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి విజయం

# గిద్దలూరులో మిన్నంటిన సంబరాలు



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**
గిద్దలూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడంతో గిద్దలూరు నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు టీడీపీ యువనాయకులు ముత్తుముల దివ్యేష్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'జై అమరావతి' నినాదాలతో గిద్దలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి జాతీయ జెండాలతో ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ పురవీధుల గుండా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేశారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ లు ఎంతోగానో కృషి చేశారని అదే విధంగా చట్టబద్ధతతకు మద్దతు తెలియజేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అమరావతి కోసం సుమారు 33 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతుల పోరాటం వృథా పోలేదని కొనియాడారు. 1600 రోజులకు పైగా ఎండనక, వాననక మహిళలు, వృద్ధులు రోడ్లపై చేసిన ధర్మపోరాటానికి ఈరోజు చారిత్రాత్మక ఫలితం దక్కిందని వారు భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు. "ఇది రైతుల కన్నీటికి, వారి మొక్కవోని దీక్షకు దక్కిన గౌరవం" అని వారు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ తీరు పై నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిగత కక్షతో అమరావతిని అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసం చేసి, రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన పాపం జగన్‌దేనని ధ్వజమెత్తారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అంతిమంగా ధర్మమే గెలిచిందని వారు స్పష్టం చేశారు. ఇక నుండి ఏపీ రాజధాని అమరావతి అని ఘంటాపథంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , ప్రజా ప్రతి నిధులు , కార్యకర్తలు , అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ రెడ్డిని పరామర్శించిన బుర్రా

**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2:**
నెల్లూరు సెంట్రల్ జైలులో రాష్ట్ర కార్యదర్శి, జిల్లాసెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్, కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ ,వెంకటగిరి నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ నేదురమల్లీ రామ్ కుమార్ రెడ్డి, వైస్సార్సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గం అని మధుసూదన్ యాదవ్ అన్నారు. కూటమిపాలనలో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నారు అని మండిపడ్డారు.కూటమి నాయకులు పెట్టించే అక్రమ కేసులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎవరూ భయపడటం లేదు అని అన్నారు. సత్యనారాయణ రెడ్డి జైల్లో ధైర్యంగా ఉన్నారు అని అన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీద కక్షపూరితంగా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు అని అన్నారు. సత్యనారాయణ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక రీచ్ ను పరిశీలించి అక్కడ జరుగుతున్న అవినీతి పై ప్రశ్నించారు అని అన్నారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలను, ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు, కేస్ తో సంబంధంలేని సెక్షన్లు నమోదు చేసి సత్యనారాయణ రెడ్డి ని జైలుకు పంపారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.చంద్రబాబు నాయుడు పాలనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు, తప్పుడు సెక్షన్ లు ఎలా పెట్టాలో ఏ విధంగా ఫిర్యాదు చేయాలో కూడా పైనుండే చెబుతున్నారు అని అన్నారు. పోలీసులు కూటమి నాయకులు చెప్పిన విధంగా ఫిర్యాదు తీసుకొని సెక్షన్లు నమోదు చేసి అక్రమ అరెస్టులు చేస్తున్నారు అని అన్నారు. టిడిపి నేతలు చేస్తున్న ఆకృత్యాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నా చంద్రబాబు నాయుడు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నాడు అని అన్నారు. కూటమి నాయకులకు ఒక న్యాయం,



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నాయకులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. సత్యనారాయణ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ గా పని చేస్తూ కూటమి నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాలను ఎదిరిస్తూ పేదలకు అండగా నిలుస్తుంటాడు అందుకే జైలుకు పంపారు అని అన్నారు. కూటమి నాయకులు అక్రమ కేసులతో భయపెట్టినంత మాత్రాన భయపడేవాళ్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎవరూ లేరు అని అన్నారు.కూటమి పాలనలో అన్యాయాలకు పాల్పడేవారికి రేపు అనేది ఒకటి ఉందని నాయకులు మర్చిపోవచ్చు కానీ అధికారులు మర్చిపోవద్దు అని అన్నారు. అధికారులు రిటైర్ అయినా సరే మీ అక్రమాలు మీద విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం అని అన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారు అని అన్నారు. పోరాడడం మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాకు ఇచ్చిన ధైర్యం అని, కూటమి నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజలకు అండగా నిలిచి పోరాడుతూ ఉంటాం అని అన్నారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మీద జరిగిన దాడి, ఆయన మీద నమోదు చేసిన అక్రమ కేసులను ఖండిస్తున్నాం అని అన్నారు. బుర్ర వెంట వైసీపీ నాయకులు తోకల కొండయ్య, ఈదర రమేష్, గంగిరెడ్డి, తల్లపనేని గోపి, కాపులూరి మధుసూదన్ యాదవ్ షేక్ రహీం తదితరులున్నారు.

# ఏజిపి గా పాశం పిచ్చయ్య ఎన్నిక అభినందించిన బిటిపిఏ నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**
గవర్నమెంట్ అదనపు అడ్వకేట్ జనరల్ (ఏ జి పి) గా పాశం పిచ్చయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఏ) రాష్ట్ర నాయకులు మెడబలిమి ముసలయ్య, తుదొడ్డి వెంకటేశ్వరరావు, జమ్ముల శ్రీనివాసులు, టి. రమేష్, జిల్లా అధ్యక్షులు లక్కీ పోగు ఆంటోనీ, సర్జు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా పిచ్చయ్య ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి పూలదండ వేసి శాలువా తో సత్కరించి అభినందించారు ఈ సందర్భంగా బిటిఏ నాయకులు మాట్లాడుతూ పాశం పిచ్చయ్య న్యాయరంగంలో అత్యంత నిష్ణాతుడిగా, ప్రజాసేవా దృక్పథంతో ముందుకు సాగిన వ్యక్తి. ఈ పదవి ఆయన కృషికి వచ్చిన ఫలితమని పేర్కొన్నారు.అతని నిష్ఠ, సేవాభావం, న్యాయపరమైన అనుభవం భవిష్యత్తులో రాష్ట్రానికి మరింతగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. పిచ్చయ్య మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కోవిలంపాడులో భక్తి శోభతో సీతారామచంద్రస్వామి గ్రామోత్సవం

## ఉత్సవాల్లో పాల్గొన్న అమడసాని బాలకేశవరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 2**
మండలంలోని కోవిలంపాడు గ్రామం లో కోదండ రామస్వామి దేవస్థానం ప్రాంగణం భక్తి పరవశంతో కళకళలాడింది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ స్వామి గ్రామోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి ఉత్సవాలలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో పండుగను ఐక్యమత్యంగా నిర్వహించుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు ఇలాంటి పండుగలు సామాజిక సమైక్యతకు ప్రతీక అని అన్నారు ఉత్సవాలలో భాగంగా అర్చకులు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను ట్రాక్టర్ పై ప్రతిష్టించి, పూలతో విశేష అలంకరణ చేసి, బాణాసంచా శబ్దాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామం అంతా ఊరేగింపు చేశారు. పురవీధులలో దర్శనమిచ్చిన స్వామివారిని చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో ముందుకొచ్చి తమ ఇళ్ల ముందు నీళ్లతో వారు పోసి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత వసంతోత్సవంలో భాగంగా గ్రామం రంగుల వర్ణవిహారం మధ్య మరింత సందడిగా మారింది. పిల్లలు, పెద్దలు రంగురంగుల గులాల్, వివిధ రంగులతో పసుపు కుంకుమలతో ఒకరిపై ఒకరు చదువుకుంటూ ఆనందోత్సవాలతో ఉత్సవాలను జరుపుకున్నారు గ్రామంలోని బజార్లు వీధులు రంగులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా జరిగాయి సీతారాముల వసంతోత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక సాంప్రదాయ సాంస్కృతిక వైభవాన్ని సాటి చెప్పింది గ్రామస్తులు స్వామివారి ఆశీర్వాదాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం ఊరేగింపుగా లంకా దహనం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల కొమరోలులో సంబరాలు





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 2**

రాష్ట్ర రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానం చేయడం పట్ల కొమరోలు లోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ,కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి నివాస ప్రాంగణంలో కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు గురువారం సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ కల్పి స్తూ పార్లమెంటులో తీర్మానం చేశారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ ,కేక్ కట్ చేసి, కొవ్వొత్తుల ప్రదర్శనతో సంబరాలు చేసుకున్నారు. దీనితో ఆ ప్రాంతం సందడిగా మారి పండుగ వాతావరణం కనిపించింది .ఆ సందర్భంగా పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చేసిన తీర్మా నం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, పార్లమెంటు సభ్యులకు కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అమరావతిని మరింత అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ రాజధానిగా తీర్చిదిద్దగలరనే ఆశ భావాన్ని నేతలు వ్యక్తం చేశారు. ముత్తుముల సంజీవరెడ్డి మాట్లాడుతూ ,అమరావతిని ఏకైక రాజధానిగా చేసుకోవాలనే రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నేటికి నెరవేరిందని, అమరావతికి భూములు ఇచ్చిన రైతుల కలలు ఫలించాయని ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజధాని మరింత అభివృద్ధి పథంలో పయనించగలదని, దీనితో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగలవని ఆయన పేర్కొన్నారు .ఆ కార్యక్రమంలో ముత్తుముల సంజీవరెడ్డి ,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి , గోపాలకృష్ణ ,ఖాజావలి , మల్లికార్జున్ రెడ్డి ,కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని, అలాం, చికెన్ కొట్టు ఖాజావలి శ్రీనివాసులు , భాష, కరీముల్లా, నాయబ్ రసూల్, బిన్ని భాష తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టండి

## వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 2**

ఊపుదంపుడు ఉపన్యాసాలు మాని రాష్ట్రంలోని నిరుపేద మహిళలకు ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టాలని కూటమి సర్కార్ కు వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ సూచించారు. రాష్ట్రంలోని మహిళలకు అది చేస్తాం ఇది చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చేసిందేమీ లేదని విమర్శించారు. ఉత్తుత్తి ప్రకటనలతో మహిళలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని మైనార్టీ మహిళల పరిస్థితి చూస్తే మరింత ధారుణంగా ఉందన్నారు. ఆధునిక జీవన విద్దానంలో భార్య,భర్తలు ఉద్యోగాలు చేస్తే గాని పూటగడవని పరిస్థితి. ఇక మైనార్టీ లలో అత్యంత పేదరికంలో ఉన్నారని అన్నారు.చాలిచాలని అదాయంతో పేద మైనార్టీలు మరింత పేదరికంలో నెట్టేయబడుతున్నారని,పేద మైనార్టీ మహిళలలో అత్యదికంగా నిరక్షరస్యత ఉందని పేర్కొన్నారు.ఈ జీవనవిధానం వారిని ప్రభుత్వం అన్ని విధాలా సహకరించి ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కూటమి ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. మైనార్టీ మహిళలకు ఇంట్లోనే ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ఇందుకోసం బ్యాంకులతో నిమిత్తం లేకుండా నేరుగా మైనార్టీ కార్పోరేషన్ల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో రోయింగ్‌కు బూస్ట్

**సూర్యలంక, విజయవాడ, విశాఖలో ప్రధాన సెంటర్లు.**

**రాష్ట్రం పర్యాటకంగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.**

**రాష్ట్ర స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. తరుణ్ కాకాని**



**విజయవాడ, పెన్ పవర్ ఏప్రిల్ 2**

రాష్ట్రంలో రోయింగ్ క్రీడ అభివృద్ధికి కీలకమైన సమావేశం విజయవాడలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. తరుణ్ కాకాని, రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బాలాజీ మారడపా, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భారణి కలిసి రాయింగ్ క్రీడను అభివృద్ధి చేయడం గురించి చర్చించారు. ఈ సమీక్షలో, సూర్యలంక, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో మూడు ప్రధాన రోయింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, జంగారెడ్డిగూడెంలో అదనపు కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు జరిగాయి. రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరఫున పడవలు, కోచ్‌లు మరియు సాంకేతిక సహాయం అందిస్తామని బాలాజీ మారడపా హామీ ఇచ్చారు. సమావేశం ముగిశాక, ఆయన ఎస్.భారణిని సన్మానించారు. అనంతరం డా. తరుణ్ కాకాని మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుండి జిల్లా స్థాయి ఎంపికలు ప్రారంభమవుతాయని, ఆ తరువాత ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రోయింగ్ క్రీడను జాతీయ స్థాయికి తీసుకెళ్తానని ఈ సమావేశం కీలక ముందడుగు అని ఆయన గుర్తు చేశారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో సంచలన తీర్పు- ముగ్గురు నిందితులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష -ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్

**అనకాపల్లి, పెన్ పవర్ ఏప్రిల్ 2**

చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పదేళ్ల క్రితం నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో నిందితులకు కోర్టు కఠిన శిక్ష విధిస్తూ కీలక తీర్పునిచ్చింది. నేరం నిరూపితమైన ముగ్గురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. హరి నారాయణ తీర్పు వెల్లడించారు. 2016, అక్టోబర్ 13న చీడికాడ మండలం అప్పలరాజుపురం సమీపంలోని త్రిషింగ్ ఫ్లోర్స్ వద్ద సుమారు 300 కిలోల గంజాయిని అక్రమంగా తరలించేందుకు నిందితులు సిద్ధమయ్యారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి పది ప్లాస్టిక్ బస్తాలలో తరలిస్తుండగా, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై జి. అప్పారావు మరియు వారి సిబ్బంది మెరుపు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. శిక్ష పడిన నిందితులందరూ చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన బొట్టా ఈశ్వరరావు (ఎ-1), గోకాడ తాతబాబు (ఎ-5), మరియు గోకాడ చెల్లు బాబు (ఎ-6). వీరిపై ఎన్ డి పి ఎస్ చట్టంలోని సెక్షన్ 20(బి )(సి) తీ/ష 8(సి) కింద నేరం రుజువు కావడంతో కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో నిందితులు అదనంగా మరో రెండేళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల వేదికకు తూట్లు

## -అధికారులపై చర్యలు తీసుకోవాలి

## -యర్రంశెట్టి ఆనంద మోహన్




**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

ప్రజల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల వేదిక కొందరు నిర్లక్ష్య అధికారుల వలన అపహాస్యం ఫాల వుతున్నది. పలువురు అధికారులు తూట్లు పొడిచే విధంగా ప్రవర్తిస్తున్నారని తప్పుడు సమాచారం ఉన్నతాధికారులకు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనందమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కందుకూరు మండలం పలుకూరు, మహాదేవపురం కొండముడుసుపాలెం, ఓగూరు పంచాయతీలలో అనుమతినేని లేఔట్ ల పై సంబంధిత అధికారులను సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరడంతో వెంచర్లకు ఎటువంటి అనుమతులు పంచాయతీ వారు ఇవ్వలేదని ఆయా పంచాయతీల పౌర సమాచార అధికారులు సమాచారం ఇవ్వడం జరిగిందని అన్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో అనధికార లేఔట్లపై చర్యలు తీసుకుని అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అర్జీ ఇవ్వటం జరిగిందని అన్నారు. అయితే ఇచ్చిన అర్జీపై పరిష్కార మార్గం ఎంతవరకు వచ్చిందని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 1100 కు ఫోన్ చేయగా ఎండార్స్మెంట్ మీకు ఇచ్చారని, వెంచర్ల కు సంబంధించిన యజమానులకు నోటీసులు అందించారని, హెచ్చరిక బోర్డులు వేశారని పొందుపరుస్తూ సమస్య పరిష్కారం చేశామని గ్రీవెన్స్ ఇచ్చిన ఫిర్యాదును క్లోజ్ చేయడం జరిగిందని వారు తెలిపారు. అయితే తనకి ఎటువంటి ఎండార్స్మెంట్ ఇవ్వకుండా, ఇచ్చినట్లు తెలిపి, సమాచార హక్కు చట్టం ద్వారా తనకు ఇచ్చిన సమాచారాన్ని ఎండార్స్మెంట్ లో పొందుపరిచి గ్రీవెన్స్ లో సమస్య పరిష్కరించామని చెప్పి తమ విధులను తప్పుదోవ పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను కోరారు. సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు నమ్మి ప్రజా ఫిర్యాదుల వేదికను ఆశ్రయిస్తే ఎవరికో లబ్ధి చేకూర్చాలని ప్రజలను మోసం చేస్తూ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు సరికాదని ఆయన అన్నారు. ఒక ప్రక్క పంచాయతీ అనుమతులు లేవని పంచాయతీ అధికారులు తెలుపుతున్న విద్యుత్ శాఖ వారు ఆ అనధికార లేఔట్లకు విద్యుత్ సౌకర్యాన్ని ఎలా ఇచ్చారో చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అగ్రికల్చర్ సంబంధించిన స్థలంలో ఇచ్చిన విద్యుత్ సరఫరాను అక్రమంగా వెంచర్ల యజమానులు సరఫరా తీసుకుంటే విద్యుత్ శాఖ అధికారులు మౌనం వహిస్తున్నారని దాని వెనక మర్మమేమిటో అర్థం కాని ప్రశ్నగా మిగిలిందని ఆయన అన్నారు. సమస్యలను తప్పుదారి పట్టిస్తున్న అధికార యంత్రాంగంపై చట్టపరమైన చర్యలు తీసుకొని మున్ముందు తప్పుడు సమాచారం ఇవ్వకుండా అధికారులకు ఉన్నతాధికారులు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

# తులసి దంత వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ



**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2**

పట్టణంలోని పడమటి వడ్డిపాలెం హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఎదురులో తులసి దంత వైద్యశాలను తూర్పు పట్టభద్రులు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో ప్రజలకు మరింత దగ్గరలో వైద్య సేవలు అందించేందుకు తులసి వైద్యశాల నిర్వాహకులు ఎంత కృషి చేస్తున్నారని అధునాతనమైన టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్యం దగ్గర చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. గత 17 సంవత్సరాల నుండి కందుకూరు పట్టణం పరిసర ప్రాంతాల ప్రజలకు దంత వైద్యశాలలో సేవలు అందించడంలో తమదైన ముద్ర వేసుకొని అందరి చేత మన్ననలు పొందుతున్న తులసి వైద్యశాలను మరిన్ని హంగులతో కార్పోరేట్ స్థాయిలో దూర ప్రాంతాలకు వెళ్లకుండా వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తున్న తులసి దంత వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ ఏ మధుసూదన రాజు భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, విద్యాశాఖ డైరెక్టర్ పోకూరి రాంబాబు,కొండేపి ఏఎంసీ చైర్మన్ కర్ణ కోటిరెడ్డి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## పొదిలి మునిసిపల్ కమిషనర్ మారుతి రావు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 2**

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పొదిలి మునిసిపల్ కమిషనర్ ఏ మారుతి రావు కోరారు. గురువారం నాడు ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారిశుద్ధ్య నిర్వహణ పట్ల పలు సూచనలు సలహాలు అందించారు. 100 కిలోల కంటే ఎక్కువ చెత్త లేదా వ్యర్థాలను ఉత్పత్తి చేసేవారు నియమ నిబంధనల మేరకు సరైన పద్ధతిలో పారవేసేందుకు వారి ప్రాంగణంలోనే తడి మరియు పొడి వ్యర్థాలను వేరు చేయాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారికి వ్యర్థాల నిర్వహణ నియమ నిబంధనల ప్రకారం 500 రూపాయల వరకు జరిమానా తో పాటు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని కమిషనర్ మారుతి రావు వివరించారు. అలాగే బహిరంగ మల, మూత్ర విసర్జనలు చేయడం కూడా పారిశుద్ధ్య నిర్వహణ నియమ నిబంధనల ప్రకారం నేరమని చెప్పారు. అందుకు కూడా జరిమాణాలు విధించే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. పాలిథిన్ కవర్లు వినియోగించడం కూడా పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకంగా మారుతుం దన్నారు. అందువల్ల ప్రజలు పాలిథ్దీన్ కవర్లను వినియోగించే అలవాటును మానుకోవాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్యపు నిర్వహణ కోసం పొదిలి నగర పంచాయతీ అధికారులకు ప్రజలు తమ సహకారం అందించాలని, తద్వారా పొదిలి నగర పంచాయతీని పారిశుద్ధపు నిర్వహణలో అగ్రస్థానంలో ఉండే విధంగా సహకరించాలని మునిసిపల్ కమిషనర్ మారుతి రావు కోరారు.

# పరిపాలన అద్భుతం

**ఎన్టీఆర్ జిల్లా, పెన్ పవర్ ఏప్రిల్ 2**

ఎన్టీఆర్ జిల్లా, ఏ కొండూరు మండలంలోని గ్రామాలు రేపూడి తండా, ఏ కొండూరు తండా గ్రామ కార్యదర్శులు వై. కోటిరెడ్డి, రామ కిషోర్, మాట్లాడుతూ ఆయా పంచాయతీలలో, డ్రైనేజీలు ఉన్నాయి, కానీ ఇంకా కొన్ని డ్రైనేజీలు కావాలని తెలిపారు. సిసి రోడ్లు, వీధి దీపాలు పెన్షన్ల, ఇంటి పన్నుల గురించి వివరణ ఇచ్చారు. గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ అద్భుతంగా పనిచేస్తుందని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. గ్రామాలలోనే కాకుండా రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి మరోవైపు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని అనడం జరిగింది. గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ నుంచి వచ్చిన నిధుల గురించి వాటిని వేటికి ఉపయోగించారు పేర్కొన్నారు. ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని అనడం జరిగింది.

# అమరావతికి చట్టబద్రత..ఒక కీలక మైలురాయి: డా. ఏలూరి



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 2**

అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఆమోదం తెలపడం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి ప్రాజెక్టు విషయంలో గతంలో నెలకొన్న సందిగ్ధత దురదృష్టకరమని అన్నారు. 2015లో అమరావతి శంకుస్థాపన నుండి నేటి వరకు రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా, పార్లమెంటులో అమరావతికి అధికారిక గుర్తింపు రావడం ఒక కీలక ముందడుగుగా ఆయన అభివర్ణించారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు, చట్టబద్ధత విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను సమర్థంగా నిర్వహించిందని, ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.. అమరావతితోపాటు ఇతర ప్రాంతాల అభివృద్ధి జరగాలని ముఖ్యంగా నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.. జిల్లాకు అతిముఖ్యమైన వెలిగొండ ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని డాక్టర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## అప్పుడేమో కేఎల్ రాహుల్, ఇప్పుడు రిషబ్ పంత్‌ను ఘోరంగా అవమానించిన లక్నో ఓనర్



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, తన జట్టు ఆటగాళ్లతో వ్యవహరించే తీరు మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ ఉన్నప్పుడు ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి, స్టీవ్ స్మిత్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించిన సంజీవ్ గోయెంకా. ఆ తర్వాత 2024 సీజన్‌లో స్టేడియంలోనే కేఎల్ రాహుల్‌ని తిట్టడంతో వివాదాల్లో నిలిచాడు. అయినా అతని పద్ధతిని ఏ మాత్రం మార్చకోలేదు. ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో లక్నో ఓడిపోయిన తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌పై అతడు సీరియస్ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకి ఆలౌట్ అయ్యింది. సమీర్ రిజ్వీ హాఫ్ సెంచరీతో ఈ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలోనే ఢిల్లీ ఛేదించింది. ఆరంభంలో లక్నో బౌలర్లు వెంటవెంటనే 4 వికెట్లు తీసినప్పటికీ.. సమీర్ రిజ్వీ ( 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు) , ట్రిస్టన్ స్టబ్స్ ( 32 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సులతో 39 పరుగులు) కలిసి 119 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ని సక్సెస్ ఫుల్ గా ముగించేశారు.

**రిషబ్ పంత్‌తో సీరియస్ చర్చలు:**

ఈ ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌తో గ్రౌండ్‌లో సీరియస్‌గా చర్చించడం కెమెరాల్లో కనిపించింది. వాళ్లేం మాట్లాడుకున్నారో వినిపించకపోయినా సంజీవ్ , రిషబ్ పంత్‌కి ఏదో చూపిస్తూ సీరియస్‌గా చెప్పడం, దానికి అతను ముఖం చిన్నబుచ్చుకోవడం నెట్టింట వైరల్ గా మారిన వీడియోల్లో కనిపిస్తుంది. జట్టు పర్ఫామెన్స్ కారణంగా సంజీవ్ గోయెంకాకి కోపం రావడంలో తప్పు లేదు, కానీ ఇలా గ్రౌండ్‌లోకి వచ్చి మరీ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ని ఘోరంగా అవమానించడం మాత్రం కరెక్ట్ కాదని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. రూ.27 కోట్లు పెట్టి కొనుగోలు చేశామని.. ఎన్ని తిట్టినా భరించాలని అనుకునే కార్పరేట్ పద్ధతి, జెంటిల్మెన్ గేమ్ క్రికెట్‌కి సెట్ కాదనే విషయాన్ని సంజీవ్ గోయెంకా గుర్తు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**గతంలో కేఎల్ రాహుల్‌ని తిట్టిన సంజీవ్:**

2024 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, 165 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కొట్టిన కొట్టుడికి ఈ లక్ష్యాన్ని 9.4 ఓవర్లలోనే ఊదేసింది సన్‌రైజర్స్. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, స్టేడియంలోనే అప్పటి లక్నో టీమ్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ని తిట్టడం సంచలనంగా మారింది.

**సంజీవ్ గోయెంకా తీరుపై విమర్శలు:**

ఈ ఘటన తర్వాత క్రికెట్ అభిమానులు, మాజీ క్రికెటర్లు అందరూ కూడా సంజీవ్ గోయెంకా తీరుని తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బులు పెట్టినంత మాత్రాన, అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్లేయర్‌ని ఇలా మైదానంలో ప్రేక్షకులందరి ముందు చివాట్లు పెట్టి, అవమానించడం మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో బ్యాడ్ అయిపోవడంతో కేఎల్ రాహుల్‌ని ఇంటికి పిలిచి, డిన్నర్ ఏర్పాటు చేసి సంజీవ్ గోయెంకా 'సారీ' చెప్పగా.. అందరి ముందు తిట్టి, ప్రైవేటుగా సారీ చెబితే చెల్లిపోతుందా? అందుకే ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్‌ని వీడి, ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీ ఆఫర్ చేసినా గత అనుభవం కారణంగానే సారథ్య బాధ్యతలు తీసుకోవడానికి కేఎల్ రాహుల్ ఇష్టపడలేదు. 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 57 పరుగులు చేసి, ఢిల్లీ క్యాపిటల్స్‌ని విజయం అందించాడు. మ్యాచ్ తర్వాత సంజీవ్ గోయెంకా మాట్లాడడానికి ప్రయత్నించినా.. రాహుల్ పట్టించుకోకపోవడం కెమెరాల్లో కనిపించింది. కానీ ఈసారి సంజీవ్ గోయెంకా తీరు మార్చుకోకపోతే రిషబ్ పంత్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి జంప్ కావడం ఖాయమంటూ ఐపీఎల్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు.. వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు."గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరఫున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది. అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరఫున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

## 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం.. 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు."మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు. అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.

## నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!



నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది





శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది

దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు.-మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు.ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com